క్లుప్తంగా

నేటి నుంచి సాగునీరు విడుదల

కోడేరు: మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి సోమవారం సాగు నీరు విడుదల చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. కేఎల్ఐ అధికారులు సాగునీరు నిలిపివేయడంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి యాసంగిలో సాగు చేసిన పంటలు ఎండిపోకుండా విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మరో 10 రోజులు సాగునీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

11న 'చలో హైదరాబాద్'

కొల్లాపూర్: టెన్త్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీ అంశంపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. లీకేజీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాత్ర ఉందన్నారు. ఆయన కుట్రల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ప్రతి గడపకు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు



కల్వకుర్తిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గడప గడపకు తీసుకెళ్లాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కురుమిద్దెలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, అనిల్‌గౌడ్, బాలరాజు, దామోదర్‌రెడ్డి, గోపాల్, శేఖర్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు



పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లో సీపీఐ, సీపీఎం ఉమ్మడి సమావేశానికి మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివకుమార్, శివశంకర్, కృష్ణయ్య, నర్సింహ, విజయుడు, లక్ష్మణస్వామి, కురుమయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి కరపత్రాలు విడుదల



లింగాల: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. 14న నిర్వహించే జయంతిని విజయవంతం చేయాలని యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం, సామ బాలస్వామి అన్ని వర్గాల ప్రజలను కోరారు.

సోషల్ మీడియా కార్యదర్శికి అభినందనలు

తాడూరు: మండల కేంద్రానికి చెందిన మద్దెల చంటి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

కొల్లాపూర్: బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని గ్రామిక వికాస కేంద్రం సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీకే కార్యాలయంలో సంస్థ 31వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న క్రై సంస్థ దక్షిణ భారత జనరల్ మేనేజర్ పీటర్ సునీల్ ఆన్‌లైన్ ద్వారా ఎస్‌వీకే సభ్యులతో మాట్లాడారు. సేవా కార్యక్రమాలను బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విజయమ్మ, తిరుపాలు, మహేష్, మన్సూర్, రేణుక, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ నాయకుల నిరసన

తెలకపల్లి: మండలంలోని తాళ్లపల్లికి చెందిన దళితురాలి ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న ఆరోపించారు. గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వ స్థలంలో కంచెను ఏర్పాటు చేస్తే, వాటిని కొందరు తొలగించారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకుని, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చస్తశారు. కార్యక్రమంలో భాస్కర్, బాబు, పద్మమ్మ, బాలస్వామి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కాల్వలకు నిలిచిన కేఎల్ఐ నీరు



తాడూరులో ఎండిపోయిన వేరుశనగ పంట



ఎండిపోయిన గుంతకోడూరు కాల్వ

పెద్దకొత్తపల్లి: కేఎల్ఐ నీరు కాల్వలకు వదలడం ఈ నెల 20 నుంచి నిలిపివేయడంతో పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల చివరి వరకు సాగునీరు అందితే పంటలు చేతికి వచ్చేవి. నీటి వసతి ఉన్న రైతులకు ఇబ్బందులుండవు. నీటి వసతి లేని రైతులు మాత్రమే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. మండలంలో కేఎల్ఐ కాల్వలపై ఆధారపడి 500 ఎకరాలలో వరిసాగు, 300 ఎకరాలలో వేరుశనగ సాగు చేశారు. సంజీవాపూర్, చంద్రకల్, తిరుమలాపూర్, వెనచర్ల, నక్కలపల్లి, పెద్దకార్పాముల, జొన్నలబొగుడ, మర్రిపల్లి, దేవినేనిపల్లి గ్రామాలలో కాల్వలపై ఆధారపడి పంటల సాగు చేశారు. ఈ నెల చివరి వరకు నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

ఎండిన పంటలు.. ఆందోళనలో రైతులు

తాడూరు: కేఎల్ఐ కాల్వల ద్వారా వస్తున్న నీటిని నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతులు ఒక్కసారిగా నీరు నిలిచి పంటలు ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గుంతకోడూరు, అల్లాపూర్ అనుసరించి ఉన్న కేఎల్ఐ కాల్వ ఫిబ్రవరిలోపే నీరు నిలిచిపోవడంతో కాల్వలు ఎండిపోయాయి. దీంతో 15రోజుల వ్యవధిలో పంటలు చేతికి వస్తాయనుకున్న సమయంలోనే నీరు లేక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కనీసం బోరు వేసుకొని పంటలను కాపాడుకుందామనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. అల్లాపూర్‌కు చెందిన రైతు శ్రీనివాసులు రూ.80 వేలు ఖర్చుచేసి మూడు బోర్లు వేశాడు. అయినప్పటికీ చుక్క నీరు రాలేదు. అధికారులు పరిశీలించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



పెద్దకొత్తపల్లిలో నిలిచిన నీరు



కేఎల్ఐ కాల్వ కింద సాగుచేసిన వేరుశనగ



తాడూరులో దెబ్బతిన్న మిరపసాగు

ఏసు చూపిన మార్గంలో పయనించాలి



బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ బీఆర్ శేషు

బిజినేపల్లి: ఏసుక్రీస్తు సమస్త జనుల క్షేమం కోసం ప్రాణత్యాగం చేసి తిరిగి లేచిన గొప్ప దేవుడని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పాస్టర్ బీఆర్ శేషు అన్నారు. మండలంలోని మమ్మాయిపల్లి గ్రామంలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మరణము గెలిచి తిరిగి లేచిన ఏసుక్రీస్తు సూక్తులు పాటిస్తూ తోటి వారికి సహాయకులుగా, ప్రేమ, దయ, కరుణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమలపెంట(అచ్చంపేట): ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామ పొలిమేరలో వారి కుటుంబీకులకు చెందిన సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, పూలుమాలలు వేసి ప్రార్థనలు చేశారు. పాస్టర్ ఆశీర్వాదం చర్చిలో ఈస్టర్ సందేశం తెలిపారు.



దోమలపెంటలో..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అమ్రాబాద్: స్థానిక రజకకాలనీ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. చింతలోనిపల్లి, కల్ములోనిపల్లి గ్రామాలకు ఈ డొంకదారి నుంచే రాకపోకలుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెలేక పోవడంతో మూగజీవాలతో పాటు ప్రజలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన ఉత్సవాలు



తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో మూడు రోజులపాటు నిర్వహించిన వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు ఆదివారం ముగిసినట్లు ఆలయ ధర్మకర్త రాఘవేందర్‌రావు తెలిపారు. చివరి రోజు బండ్ల ఊరేగింపు, ఉత్సవ విగ్రహాలను ఊరేగించి చక్రస్నానం చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లకు చెందిన చెందిన శంకర్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన సిర్సనగండ్ల మిషన్ భగీరథ పథకంలో వాటర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహించారు. ఆదివారం వారి కుటుంబానికి మిషన్ భగీరథ కార్మికులు రూ.16 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అంజయ్య, హైమద్, రాముడు, సుమన్, జగన్‌బాబు తదితరులు ఉన్నారు



చారకొండలో ఆర్థికసాయం అందిస్తున్న కార్మికులు

పూర్వ విద్యార్థికి..

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన పారిజాత అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతుంది. ఆదివారం 2006 సంవత్సరం ఇంటర్మీడియట్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కుటుంబాన్ని కలిసి పారిజాత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నీరటి కుమార్, సంజీవ, మున్నా, కృష్ణ, ప్రశాంత్, శ్రీసాయి, శేఖర్ ఉన్నారు.

క్రీడాకారుడి కుటుంబానికి అండగా ఉంటాం

అచ్చంపేట రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన నేతాజీ క్రికెట్ క్లబ్ క్రీడాకారుడు రాము కుటుంబానికి అండగా ఉంటామని క్లబ్ సభ్యులు పురుషోత్తం, చంద్రమౌళి, వెంకటేష్, మూస తెలిపారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 58వేలు అందించారు. కార్యక్రమంలో రేణు, వసంత్, రవి, సురేష్, జయానంద్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి

జడ్చర్ల/బాలానగర్: ధ్యానం ద్వారా ఆరోగ్యం, ఆనందంగా ఉంటామని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బాలకృష్ణా రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్న ఆదిరాల, పెద్ద ఆదిరాల, ఎక్వాయపల్లి గ్రామాల్లో ధ్యానంపై అవగాహన శిబిరాలు నిర్వహించారు. ధ్యానం చేసే విధానం, ధ్యానం చేయడం వల్ల కలిగే ఫలితాలను వివరించారు. మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి బయట పడగలుగుతామన్నారు. ధ్యానం వల్ల అనేక రుగ్మతల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేయడం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు శ్రీనివాస్, రాంచంద్రయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

అచ్చంపేట రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలికేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో చేపట్టిన చలివేంద్రంను ప్రారంభించారు. బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు.



ఓర్వలేకనే ప్రతిపక్షాల విమర్శలు

వెల్దండ: రాష్ట్రంలో బీఆర్ఎస్‌కి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షపార్టీలు కుట్రలు, విమర్శలు చేస్తున్నాయని ఆత్మీయ సమ్మేళన రాష్ట్ర పరిశీలకుడు పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ కేంద్రంలో, ఆయా రాష్ట్రాలో అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణలోని సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు. వారు మత, కుల రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, వైస్ చైర్మన్ బాలాజీసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేజైపాల్‌యాదవ్



సమ్మేళనానికి హాజరైన ప్రజలు

నిరుద్యోగులకు అండగా నిలుస్తాం

కల్వకుర్తి: నియోజకవర్గంలోని నిరుద్యోగులకు అండగా నిలుస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి విద్యా, వైద్యం, ఉపాధిని లక్ష్యాలుగా చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. కల్వకుర్తి, ఆమనగల్‌లో అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి పేద వారికి వైద్య సేవలు అందించేలా చూస్తున్నామన్నారు. మే 6 తేదీన మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు 50 కంపెనీ ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని, 5వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.



జాబ్‌మేళా పోస్టర్ విడుదల చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 35మంది లబ్ధిదారులకు రూ.12.38లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేసిన ఖర్చులకు సంబంధించి ప్రభుత్వపరంగా అందించే సీఎం సహాయనిధి వరంగా మారిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, నాయకులు రామ్మోహన్, ఇమ్ము, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

స్థానిక నిమ్మబాయిగడ్డలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందును నిర్వహించడం అభినందనీయమన్నారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దా నీష్, మసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



సంఘం జెండా ఎగురవేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ ఏర్పడిందని అన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎన్ఎస్‌యూఐ నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యూఐ నుంచే చాలా మంది నాయకులు జాతీయస్థాయికి ఎదగారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో ఎన్ఎస్‌యూఐ ముందుండి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు జహీర్ అఖ్తర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, నాయకులు బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రీ, అజ్మత్‌అలీ, రమేశ్, పీర్ సాధిక్, రాములు యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లు నివారణకు చర్యలు తీసుకోవాలి

పాలమూరు: జిల్లా కేంద్రంలో కల్తీ కల్లు, కల్తీ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మన పాలమూరు అభివృద్ధి ఫోరం సభ్యులు ఆదివారం ఎక్సైజ్ సీఐ వీరారెడ్డికి వినతి పత్రం అందించారు. కల్తీకల్లు తయారీ, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు మున్నూర్ రవి, విశ్వనాథ్ రావు భాండేకర్, వర్ధ యాదయ్య, పటేల్ వెంకటేష్, ఆంజనేయులు, మహేష్, రాకేష్ పటేల్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉప్పునుంతలలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉప్పునుంతల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆదివారం మండలంలోని వెల్టూర్ స్టేజీ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా మారింది. వెల్టూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 1997 నుంచి 2002 వరకు పదో తరగతి చదువుకున్న 50 మంది పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు ఒక్కొక్కరుగా యోగక్షేమాలను మిత్రులకు వివరించారు. కార్యక్రమంలో శంకర్‌కుమార్, అభితేజ్‌రెడ్డి, దేవేందర్, సత్యం, రాజు, నవేందర్, వరలక్ష్మి, స్వాతి, మంజుల, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వినూత్నరీతిలో ఆత్మీయ సమ్మేళనం

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1980–81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం వినూత్న రీతిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులకు ఘన స్వాగతం పలికారు. గురువులను కొత్తబస్టాండ్ నుంచి ఓపెన్ టాప్ జీపు బ్యాండ్ మేళాలతో ఉన్నత పాఠశాల వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా సెషన్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ అధ్యక్షతన గురువులు వెంకటరమణ, సుధాకర్, కృష్ణారెడ్డి, జనార్దన్, మలహరి, జాహంగీర్‌నాయక్, రఘుపతిరావులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో సామూహిక భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కందుల చంద్రశేఖర్, రాజు, రాంనారాయణ సింగ్, ఇస్మాయిల్, శ్రీహరి, శ్రీనివాసులు, లింగమ్మ, తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో గురువులను ఓపెన్ టాప్ జీపులో ఊరేగిస్తున్న పూర్వపు విద్యార్థులు



లింగాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు